మంగళవారం 22 అక్టోబర్ 2024 5 అనంతపురం



రైతు కంట కన్నీరు..!

మహాధర్నాలో అన్నదాత ఆవేదన


కన్నీరు పెట్టుకుంటున్న రైతు రాముడు

ఈ ఫొటోలు కన్పిస్తున్న రైతు పేరు రాముడు. ఈయనది గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామం. చీనీ పంటను సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. వర్షాభావంతో బోర్లన్నీ ఎండిపోయాయి. దీంతో చీనీచెట్లు ఎండదశకు చేరుకున్నాయి. చెట్లను ఎలాగైనా కాపాడుకోవాలన్న ఉద్దేశంతో పంటకు నీరు తడిపేందుకు ఓ ట్రాక్టర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ రైతు కుమారుడు పొలానికి నీరు తీసుకొచ్చే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. 25 ఏళ్ల వయసులో చేతికొచ్చిన కుమారున్ని ఈయన కోల్పోయాడు. కాలువలకు సాగునీరు ఇచ్చి ఉంటే తమ బోర్లు ఎండిపోయేవి కావని, తన కుమారుడు మరణించేవాడు కాదంటూ మహధర్నా వేదికగా కంటతడి పెట్టాడు. రైతు ఆవేదనను విన్న అక్కడున్న వారంతా ఒక్కసారిగా చలించిపోయారు.


కలెక్టరేట్ వద్దకు ప్రదర్శనగా వస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

- ◆ పొలాలకు నీరిచ్చేలా కృషి చేయాలి
- ◆ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తీరని రైతు కష్టాలు
- ◆ 14 ఏళ్లు అయినా సాగునీటి కాలువలను ఆధునీకరించలేరా..?
- ◆ 2 లక్షల మంది రైతుల సంతకాలతో ప్రభుత్వానికి నివేదిస్తాం

సాగు నీరు రైతుల హక్కు


జిల్లా నలుమూలల నుంచి మహాధర్నాకు హాజరైన రైతులు, రైతు కుటుంబ సభ్యులు

- ◆ కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో సిపిఎం నేతలు
- ◆ పెద్ద ఎత్తున తరలొచ్చిన రైతులు, కూలీలు

'నిత్యం కరువుతో సతమతం అవుతున్న అనంతపురం జిల్లా రైతులకు సాగునీరు అందించడం ఎవరి బిక్ష కాదు.. అది రైతుల జన్మహక్కు... ఆ దిశగా పాలకులు ప్రభుత్వాలు సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలి" అని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టారు. బస్సుయాత్ర ముగింపు సందర్భంగా సాగు, తాగునీటి సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ముందుగా సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి మహాప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలరంగయ్య అధ్యక్షతన మహాధర్నా కొనసాగింది. బస్సుయాత్ర సందర్భంగా గుర్తించిన సాగునీటి సమస్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఒక్కొక్కటిగా వివరిస్తూ రైతుల కష్టాలను కళ్లకు కట్టినట్లు తెలియజేశారు. దశాబ్దాల తరబడి పాలకులు, ప్రభుత్వాలు సాగునీటిపై అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సాగునీటి కోసం ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ.. రైతుల కోసం పోరాటాలు కొనసాగిస్తామని మహాధర్నా వేదికగా పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్




సాగునీటి కోసం పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

జిల్లాలో సాగు, తాగునీటి కోసం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పునరుద్ఘాటించారు. కరువు జిల్లాకు ప్రాజెక్టులు, జలాశయాల నీరే ప్రధానం అన్నారు. గడిచిన ఐదేళ్లలో నీటి నిర్వహణకు ఒక్కపైసా కూడా నిధులు కేటాయించలేదన్నారు. హెచ్ఎల్‌సి ఆధునికరణ ఆగిపోయిందని, తుంగభద్ర డ్యాం గేట్లు మరమ్మత్తులు లేవని, హంద్రీనీవా కాలువ నిర్వహణ సక్రమంగా లేదని తెలియజేశారు. బిటి ప్రాజెక్టు మధ్యలో ఆగిపోయిందన్నారు. చాగల్లు రిజర్వాయర్, సుబ్బరాయసాగర్‌ల నీటి నిర్వహణపై గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేవలం జీవోల పేరుతో కాలం వెల్లదీశారన్నారు. జీవోలతో నీళ్లు రావని, నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే నీరు వస్తాయన్న విషయాన్ని పాలకులు, ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సాగునీటిపై అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 120 రోజుల అవుతున్నా సాగునీటిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను నవంబర్‌లో ప్రతిపాదన చేస్తామని చెబుతున్నారని, ఆ బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించి సాగునీటి కాలువలకు అవసరమైన పూర్తి స్థాయి నిధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హంద్రీనీవా కాలువ ద్వారా 1,86,900 ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు పిల్ల కాలువలు తవ్వాలన్నారు. తుంగభద్ర ఆధునీకరణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సాగునీటి సాధన కోసం సిపిఎం నిరంతర పోరాటం కొనసాగిస్తుందన్నారు. సాగునీరు అందించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని అందరు ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టె సందర్భంగా పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని కోరుతూ 2 లక్షల మంది రైతులతో సంతకాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.



మహాధర్నాలో రైతు సమస్యలపై ఫ్లెక్సీల ద్వారా కథనాల ప్రదర్శన చేస్తున్న నాయకులు



పాలకులకు సిగ్గుండాలి

మానవహక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా

జిల్లా రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైన గత, ప్రస్తుత ప్రభుత్వ పాలకులు సిగ్గుపడాలని మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా విమర్శించారు. 2009లో హెచ్ఎల్‌సి ఆధునికరణ ప్రారంభిస్తే ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా రైతులను పట్టించుకునే పరిస్థితి లేకపోవడం విచారకరం అన్నారు. టిడిపి ప్రభుత్వం గతంలో కూడా అనేక హామీలు ఇచ్చి, వాటిని మరిచిపోయిందన్నారు. రైతులు, ప్రజలకు అన్ని గుర్తుంటాయని విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలన్నారు. సాగునీరు, ప్రజాసమస్యలను విస్మరించినందుకే వైసిపి 11 సీట్లకు పరిమితం అయ్యిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంకు ఆగతి పట్టకూడదంటే జిల్లా రైతాంగం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలియజేశారు.



హెచ్ఎల్‌సి ఆధునీకరణకు నిధులు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు

జిల్లాలో వ్యవసాయం బాగుపడాలంటే హెచ్ఎల్‌సిని ఆధునీకరించి సాగునీటిని అందించడమే ఒక్కటే మార్గమని సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు తెలిపారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువలు 6 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉండేలా వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ మాటను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువలకు అనుసంధానంగా పిల్ల కాలువలు పునరుద్ధరించి చెరువులను నీటితో నింపాలన్నారు. డ్యాముల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పుడు వాటిని రైతులకు అందిస్తే పంటల సాగుకు వీలవుతుందన్నారు. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.సావిత్రి

కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం, తక్కువ ధరకే ఇస్తామంటూ పదేపదే ప్రకటనలు చేస్తోందని, రైతులకు కావాల్సింది మద్యం కాదని నాణ్యమైన విత్తనాలు, ఎరువులను తక్కువ ధరలకు అందిస్తే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.సావిత్రి తెలిపారు. జిల్లాలో వర్షాలు కురిసినా కరువే, కురవకపోయిన కరువే ఉందన్నారు. పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, కురుస్తున్న వర్షాలకు ద్రాక్ష పంట పూర్తిగా దెబ్బతిని పొలంలోనే వదిలేసే పరిస్థితి ఉందన్నారు. ఆ ద్రాక్షను ప్రభుత్వం రైతులతో కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లు, కెజిబివి, మోడల్ స్కూళ్లకు అందిస్తే విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. మద్యాన్ని పూర్తి స్థాయిలో నివారించి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మహాధర్నా సందర్భంగా సాగునీటి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిపిఎం నాయకులు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌కు అందజేశారు. నాయకులు గఫూర్, రాంభూపాల్, ఓబులు తదితరులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సాగునీటి అధికారులతో సమావేశం నిర్వహించి, జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, ఓ.నల్లప్ప, బి.శ్రీనివాసులు, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, కృష్ణమూర్తి, రంగారెడ్డి, నిర్మల, భాస్కర్, మన్నీల రామాంజినేయులు, వెంకటనారాయణతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు రెండు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్వతీనగర్‌లోని 1వ వార్డు సచివాలయం, డ్రైవర్స్ కాలనీలోని 9వ వార్డు సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రాలు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ పని చేస్తాయన్నారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలు ఐదేళ్లలోపు పిల్లలు, ఐదేళ్ల పైబడిన వారికి కొత్తగా ఆధార్ నమోదు చేస్తారని తెలిపారు. బయోమెట్రిక్ అప్డేషన్, మొబైల్ నెంబర్ లింక్, ఇతర చేర్పులు, మార్పులు, 60 ఏళ్ల పైబడిన వారికి బయోమెట్రిక్ అప్డేషన్, తదితర సేవలు అందిస్తారన్నారు.

మరువ పారిన మల్లాపురం చెరువు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని మల్లాపురం చెరువు సోమవారం ఉదయం నుంచి మరువ పారుతోంది. ఇటీవల కురుస్తున్న వరుస వర్షాలకు తోడు, ఎగువన ఉన్న కర్నాటకలో కురిసిన వర్షాలకు మొలకాల్మూరుకొండ, నరసింహస్వామి ఆలయ సమీపంలోని కొండల్లో నుంచి వర్షం నీరు పెద్దఎత్తున మల్లాపురం చెరువులోకి చేరడంతో మరువ పారుతోంది. రెండేళ్ల తర్వాత చెరువు నిండడంతో బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లాపురం చెరువు నిండితే డి.హీరేహాల్ మండలంలోని మురిడి, రాయదుర్గం మండలంలోని పల్లేపల్లి, కొంతానపల్లి గ్రామాల బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

'మాధవ్... నోరు అదుపులో పెట్టుకో'

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కళ్యాణదుర్గం తాలూకా తెలుగు యువత అధ్యక్షుడు నీలాస్వామి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పిపిఎస్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల మాధవ్ నోరు పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. సూపర్ వ్యక్తి ఎవరో.. లోఫర్ వ్యక్తి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. సిఎం చంద్రబాబు ప్రాధాన్యతా క్రమంలో ఉచిత గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, తదితర సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేస్తే సహించబోమన్నారు.

కళ్యాణదుర్గం రైల్వేస్టేషన్ మాస్టర్‌గా ధర్మతేజ

ప్రజాశక్తి-రాయదుర్గం

కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్ మాస్టర్‌గా ధర్మతేజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకూ రాయదుర్గం స్టేషన్‌లో విధులు నిర్వహించేవారు.

గుండె వ్యాధిగ్రస్తునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

గుండె సంబంధిత జబ్బుతో బాధ పడుతున్న శాంతారాజ్ అనే వ్యక్తికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ఉపాధ్యాయుడు బద్దేనాయక్ రూ. 20వేలు అందజేశారు. శాంతరాజ్ చాలా రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతుండేవాడు. కళ్యాణదుర్గంలోని ఓ ఆసుపత్రికి వెళ్లగా బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అయితే శాంతారాజ్ కుటుం బం ఆర్థిక పరిస్థితి గురించి మిత్రుడు ద్వారా తెలుసుకున్న బద్దేనాయక్ రూ. 20వేలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : కాలవ

ప్రజాశక్తి-బొమ్మనహాల్


టి.వీరాపురంలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టి సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి మండలానికి మొత్తం రూ. 3.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడగామని తెలిపారు. కార్యక్రమంలో అధికారి జగదీష్, నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, నవీన్‌కుమార్, సైకిల్‌షాపు హనుమంతు, కురువ సంఘం అధ్యక్షులు నాగరాజు, అన్సర్‌బాషా, దేవగిరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్దేహాల్ ఆరోగ్య ఉపకేంద్రం మరమ్మతులు చేపట్టాలి

మండలంలోని ఉద్దేహాల్ గ్రామ ఆరోగ్య ఉప కేంద్రానికి మరమ్మతులు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. నర్సులు ఉండే క్వాటర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోననే భయం వెంటాడుతోందన్నారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాయదుర్గం రూరల్ : గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చేలా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని టి.వీరాపురం గ్రామంలో దొణ గంగమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈఈ సుధాకర్‌నాయక్, ఎంపీడీవో కొండన్న, ఈవోఆర్డీ మురళీకృష్ణ, జెఈ మునిస్వామి, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, మాజీ సర్పంచి సుంకన్న, నాయకులు గంగాధర్‌శెట్టి, సోమశేఖర్, హనుమంతు, రాజశేఖర్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

బ్రహ్మసముద్రం : మండలంలోని పాలవెంకటాపురం గ్రామ సచివాలయంలో సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేసినట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. బృందం సభ్యురాలు డిపిహెచ్ఎన్ హేమలత సచివాలయంలోని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గోయింగ్, నాన్ గోయింగ్ బాలికలకు హెచ్‌బి పరీక్షలు చేయడంతో పాటు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బందికి రికార్డుల నిర్వహణతో పాటు పలు సూచనలు చేశారు. హై రిస్క్ గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సుఖ ప్రసవం చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఆశా కార్యకర్త, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చే బాధ్యత మనపైనే ఉందని, ప్రతి ఒక్కరూ ఈ విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామలక్ష్మి, ఎఎన్ఎంలు సావిత్రి, కవిత, రోజా, పద్మ, మహాలక్ష్మి, వన్నూరమ్మ, లక్ష్మి, సుధ, ఎంఎహెచ్‌పిలు సల్మా, లక్ష్మీదేవి, రోజా, సైని, మృదుల, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలే స్ఫూర్తి

ఆశయసాధనకు విధుల్లో పునరంకితమవుదాం

ప్రజల భద్రతే లక్ష్యంగా పని చేద్దాం

డిఐజి డా॥షిమోసి, ఎస్పీ పి.జగదీష్


అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న జడ్జి, కలెక్టర్, డిఐజి, ఎస్పీ, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలు, సమాజ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలే స్ఫూర్తిగా వారి ఆశయ సాధనకు విధుల్లో పునరంకితం అవుదామని అనంతపురం రేంజ్ డీఐజీ డా॥షిమోసి, ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌తో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో సేవలు అందిస్తూ ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు అమర వీరుల సేవలు చిరస్మరణీయం అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ ప్రశాంతత కోసం నిరంతరం పోలీసులు పని చేస్తున్నారన్నారు. కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ అధికారుల వరకు అందరూ నిరంతరం ప్రజలు, సమాజం కోసం పని చేస్తున్నారని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులు, ప్రజలకు పోలీసు విధులపై అవగాహన కల్పిస్తామన్నారు. వీటితో పాటు రక్తదాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. విధి నిర్వహణలో పోలీసు వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి గురించి వివరిస్తామన్నారు. పోలీసు నిబద్ధత, కార్యదీక్షతపై చైతన్యం చేస్తూ, పోలీసు అమరవీరుల స్ఫూర్తితో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమాన్ని సమీక్షించి వారి శ్రేయస్సు గురించి కషి చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసు దళాల పాత్ర చాలా కీలకమైందన్నారు. ప్రతి పోలీసూ దేశానికి వెన్నెముక లాంటి వాడన్నారు. దేశ అంతర్గత శత్రువు, బహిరంగ శత్రువులు నుండి సామాన్య మానవులను కాపాడటంలో త్యాగాలకు సైతం సిద్ధం అవుతున్నారని తెలియజేశారు. సమాజం ప్రశాంతంగా ఉండాలంటే పోలీసు సేవలు తప్పనిసరి అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకారాలు అందించి శాంతిభద్రతలకు సహకారం అందించాలన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో పోలీసు సేవలు మరువలేనివన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలూ పాటుపడుతున్నారని కొనియాడారు. జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. రక్షణ విభాగంలో పని చేస్తున్న పోలీసులు అందరూ గొప్పవారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర అమోఘమన్నారు. అనంతరం గతేడాది రోడ్డు ప్రమాదాలు, వివిధ కారణాలతో చనిపోయిన 12 మంది పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు కలిపి మొత్తం రూ.1.05 లక్షలను చెక్కుల రూపంలో ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, అదనపు ఎస్పీ డివి.రమణమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఈబి.దేవి, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, ఎస్.మహబూబ్ బాషాతో పాటు సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

సహాయ నిరాకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్ఐసి ఏజెంట్లు పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ యాజమాన్యం ప్రవేశపెట్టిన విధానాలు, నిబంధనలు ఏజెంట్లకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయన్నారు. వాటిని వ్యతిరేకిస్తూ ఏజెంట్లు అందరూ సంఘటితమై ఈ నెల 14 నుంచి 28వ తేదీ వరకూ పూర్తిగా సహాయ నిరాకరణ కార్యక్రమానికి అఖిల భారత ఏజెంట్ల సమాఖ్య ఇచ్చిన పిలుపు ఇచ్చిందన్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకూ గేట్ మీటింగ్ నిర్వహించామన్నారు. ఏజెంట్లు, పాలసీదారుల సంక్షేమాన్ని వ్యతిరేకించే విధానాలను ఎల్ఐసి యాజమాన్యం విడనాడాలని డిమాండ్ చేశారు.

బిటిపిలో నీటి చేరిక, కాలువల నిర్వహణపై ఆరా

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం


సుభాన్

ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో సోమవారం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బైరవానితిప్ప ప్రాజెక్టు(బిటిపి) ఆయకట్టు మాజీ ఛైర్మన్ సుభాన్‌కు ఫోన్ చేసి నీటి చేరికపై ఆరా తీశారు. అలాగే బిటిపి కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు త్వరితగతిన చేపట్టాలని తెలిపారన్నారు. కుడి కాలువ కింద సాగయ్యే భూమి ఎంత, చివరి ఆయకట్టు వరకూ ప్రతి రైతుకు నీరందేలా చూడాలన్నారు. కాలువకు ఏర్పడిన చిన్న, పెద్ద రంధ్రాలను మూసి వేయాలని, చుక్క నీరు వృథా కాకుండా సాగు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో కాలువ తవ్వకాలను ప్రారంభిస్తామన్నారు. ఎగువ ప్రాంతమైన కర్నాటక నుంచి బిటిపికి పెద్దఎత్తున నీరందే సూచనలు ఉన్నాయని, అందుకనుగుణంగా త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. ప్రాజెక్టు నిండితే ఆ నీరు ఆయకట్టు రైతులకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇక 4 అడుగుల మేర నీరు చేరితే ప్రాజెక్టు నిండుతుందని సుభాన్ ఎమ్మెల్యేకి తెలిపారు. త్వరలోనే నీటి సంఘం ఎన్నికలకు ప్రభుత్వం జీవో విడుదల చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. సుభాన్‌తో పాటు నాయకులు తిప్పేస్వామి, నాగరాజు, అంజి, ధనంజి, రామ్మోహన్, మారుతి, జనసేన తిమ్మరాజు, సిద్దూ ఉన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. సోమవారం తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సీఎం చంద్రబాబు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా 74 మంది చిన్నారులు, మహిళలపై అత్యాచార ఘటనలు జరిగాయన్నారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురంలో ఓ బాలికపై అత్యాచార ఘటన జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వైసిపి హయాంలో మహిళలకు రక్షణగా దిశా యాప్ తీసుకొచ్చామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందన్నారు. అంతేగాకుండా నాలుగు నెలలుగా వైసిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీస్‌వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్నారని, ప్రతిపక్షాలను అణగదొక్కడానికి మాత్రమే పోలీసులు పని చేస్తున్నారని విమర్శించారు. హిందూపురంలో దసరా పండుగకు ముందు రోజు అత్తాకోడళ్లపై అత్యాచారం చేశారని, బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించారని, నంద్యాల జిల్లా మచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక మృతదేహం ఇప్పటికీ దొరకలేదని గుర్తు చేశారు. ఆడపిల్లల మాన, ప్రాణాల రక్షణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు తీక్షణ్‌సాయి


ట్రోఫీ అందుకుంటున్న వి.తీక్షణ్‌సాయి

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూట్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వి.తీక్షణ్‌సాయి అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తీక్షణ్ సాయి అనంతపురం టవర్ క్లాక్ వద్ద గల శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానం పొందిన తీక్షణ్ రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాడు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తీక్షణ్ సాయి కి ఉత్తమమైన తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించిన ఆర్యన్ షూటింగ్ అకాడమీ అధినేత, కోచ్ శ్రీకాంత్, శ్రీనివాసులకు తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు. డిసెంబర్‌లో భూపాల్‌లో జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు జరగనున్నాయి. జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి -అనంతపురం

ఎస్‌కె యూనివర్సిటీ, అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం సంయుక్తంగా కలిసి నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పెరేడ్‌కు ఎంపికలను సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ సైదా, ఎస్‌కె యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్ రావు, జెఎన్‌టియు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శారదతో కలిసి రెండు యూనివర్సిటీల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కోసం ప్రీ-ఆర్‌డి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఎత్తు, పరుగు సామర్థ్యం, కవాతు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలతో సహా వాలంటీర్ల శారీరక దఢత్వం సమగ్ర మూల్యాంకనంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వాలంటీర్లను మాత్రమే తదుపరి పరిశీలన కోసం తదుపరి జాబితా తయారు చేయబడుతుందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు తెలిపారు.

చిరస్మరణీయుడు విద్వాన్‌విశ్వం


విద్వాన్ విశ్వంకు నివాళులర్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

విద్వాన్ విశ్వంగా ప్రసిద్ధి చెందిన మీసరగండ విశ్వరూప చారి సాహితీవేత్తగా, పత్రికా సంపాదకుడుగా, రాజకీయవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి ప్రతిష్టలు అందుకున్నారని పలువురు సాహితీ ప్రియులు కొనియాడారు. విద్వాన్ విశ్వం 19వ జయంతి సందర్భంగా మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం, తెలుగు వెలుగు సాహితీ సేవా సంస్థ సంయుక్త నిర్వహణలో సోమవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో విద్వాన్ విశ్వం చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి ప్రసంగిస్తూ విద్వాన్ విశ్వం రాయలసీమ ప్రాంత ఉన్నత్యాన్ని అనంతపురం ప్రజల స్థితిగతులను అనేక కావ్యాల ద్వారా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగ, నానీల నాగేంద్ర, హెచ్ నాగలింగయ్య, గంగిరెడ్డి గారి అశ్వర్థ రెడ్డి విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు, మస్తానప్ప పాల్గొన్నారు.

విద్వాన్ విశ్వం కమిటీ ఆధ్వర్యంలో...

విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్వాన్ విశ్వంకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కమిటీ కన్వీనర్ ఎజి.రాజమోహన్, కో కన్వీనర్ పామిడి శ్రీనివాసరావు, ఎంఎంటి రాజు, కమిటీ సభ్యులు రవిచంద్ర, మురళి, జిలాన్ బాషా తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ముగిసిన 'పల్లె పండుగ'


భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యల్లనూరు : ఈనెల 14 నుంచి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం సోమవారం ముగిసింది. చివరిరోజు సోమవరం మండల కేంద్రంలో సుమారు రూ.53 లక్షలతో సీసీ రోడ్లు, రూ.16 లక్షలతో డ్రెయినేజీ కాలువల నిర్మాణాలను భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, ఇసి బబులు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్, జయరామ్, టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు : పట్టణంలోని మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిఎఇ కె.నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు కారణంగా పట్టణంలోని రాజేంద్రనగర్, ఎస్ఎల్‌వి థియేటర్, రామస్వామి గుడి వీధి, సత్యనారాయణ పేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నర్రా కేశన్నకు ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దగ్గుపాటి

అనంతపురం రూరల్ : టిడిపి సీనియర్ నాయకుడు నర్రా కేశన్నను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఉరవకొండలో పరామర్శించారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్రా కేశవన్న తనయుడు, వైద్య విద్యార్థి చైతన్య మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఉరవకొండలోని కేశవన్న నివాసానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామసభలతో భూసమస్యలు పరిష్కారం

బెలుగుప్ప : రైతుల భూ సమస్యలు భూసర్వేలో పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తోందని తహశీల్దార్ సి.షర్మిల తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆవులెన్న, గుండ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుల నుంచి భూ సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, గుండ్లపల్లి సర్పంచి పురుషోత్తమ, డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒలు, మండల సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో రైతు నారాయణస్వామి సాగు చేసిన వేరుశనగ పొలంలో తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా వర్షాభావం నేపథ్యంలో వేరుశనగ దిగుబడి తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఒ విజయకుమార్, ఎఇఒ హరి, ఎంపిఇఒ సుమతి, విఆర్ఎ నల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

కోతకు గురైన కల్వర్టులు-ఆందోళనలో వాహనదారులు




కల్వర్టుల వద్ద ఏర్పడిన గోతులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని పాతపల్లి, అచ్యుతాపురం గ్రామాల సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ వర్షాలకు ఆయా కల్వర్టుల వద్ద రోడ్డు కోతకు గురైంది. కోతకు గురైన ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు భయాందోళన చెందు తున్నారు. ముఖ్యంగా పాతపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే సుమారు 40 అడుగుల లోతు గొయ్యి ఉంది. గొయ్యిలోకి వరద నీరు వెళ్లే కల్వర్ట్ కోతకు గురైంది. దీంతో రోడ్డు సైతం నీటికి కొట్టుకుపోయింది. అలాగే అచ్యుతాపురం గ్రామం వద్ద గుట్టపై బొప్పేపల్లి గ్రామానికి వెళ్లే సమీపవంలో రోడ్డు పక్కన 10 అడుగుల లోతుతో కల్వర్ట్ కోతకు గురైంది. ఈ రెండు ప్రాంతాల్లో కూడా ఎదురుగా వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి. దీంతో వాహనదారులు రాత్రిళ్లుబిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుదని వాపోతున్నారు. ఆదమరిచి వెళ్తే మాత్రం ప్రమాదం బారిన పడాల్సిందే. ఆర్అండ్‌బి అధికారులు ఆయా ప్రాంతాల్లో కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ఆందోళన చెందుతున్నారు. కోతకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులను బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణం కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే నాలుగు నెలల్లోపు రెగ్యులర్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఓ ఒక్క సమస్యనూ పరిష్కరించిన పాపానపోలేదన్నారు. ఉద్యోగస్తులకు మెరుగైన 12వ పిఆర్‌సి అముల చేయాలని, బకాయి ఉన్న డీఏలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు రూ.21వేల వేతనం ఇవ్వాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, 2011లో పెండింగ్‌లో ఉన్న 9 నెలల పీఎఫ్ అమౌంటు కార్మికుల ఖాతాలకు జమ చేయాలని, పంప్‌హౌస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న వారికి టీఏ, డీఏలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయి జీతాలు ఇవ్వాలని, ఎన్ ఎం ఆర్ కార్మికులకు బకాయి వేతనాలతోపాటు పర్మినెంట్ కార్మికులుగా గుర్తించాలని, అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, డెత్ క్లెయిమ్ అమలు చేస్తూ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫోన్ చేసి తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ముత్తరాజు, ఎం.నల్లప్ప, జిల్లా ట్రెజరర్ ఆదినారాయణ, నగర ట్రెజరర్ నారాయణస్వామి, నగర అధ్యక్షులు బండారి స్వామి, కళ్యాణదుర్గం నగర అధ్యక్ష, కార్యదర్శులు వన్నూరుస్వామి, శివ, గుత్తి నగర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, కార్తీక్, నాగు, తదితరులు పాలొన్నారు.

రైతుల గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతుల గురించి మాట్లాడే కనీస అర్హత వైసిపి నాయకులు, అనంతపురం జిల్లా వైసీపీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి లేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్‌లు తెలియజేశారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంత వెంకటరామిరెడ్డికి రైతులు ఇప్పుడే గుర్తుకొచ్చారాని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏరోజైనా రైతుల గురించి పట్టించుకున్నారాని నిలదీశారు. కూటిమి ప్రభుత్వం అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువను 1800 క్యూసెక్కుల నుంచి 3500 క్యూసెక్కుల వరకు పెంచేందుకు డిపిఆర్ కూడా సిద్ధం చేశారన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఇవ్వాల్సిన రూ.1400 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వంలో ఇస్తున్నట్లు తెలియజేశారు. డ్రిప్, స్ప్రింక్లను సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో చంద్రబాబు పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జెడ్పిటిసి రామలింగారెడ్డి, జిల్లా పార్టీ మీడియా కోఆర్డినేటర్ కూచిహరి తదితరులు పాల్గొన్నారు.

రూ.62కోట్లతో తాగునీటి ప్రణాళికలు

మంత్రి పయ్యావుల కేశవ్


కాలువను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంతోపాటు ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు రూ.62కోట్లతో ప్రణాళికలను రూపొందించినట్లు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం కూడేరు మండలం జల్లిపల్లి వద్ద ఉన్న పిఎబిఆర్‌తోపాటు తాగునీటి ప్రాజెక్టులు, వాష్ ఫిల్టర్ బెడ్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఉరవకొండ మండలం ఇంద్రావతి వద్ద ఉన్న హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న పంపింగ్ పనులను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉరవకొండ నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానన్నారు. ముఖ్యంగా ఉరవకొండకు సంబంధించి తాగునీటి వ్యవస్థను పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. 20ఏళ్లపాటు ఉండేలా పనులు చేపడుతున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో ఉరవకొండ నియోజకవర్గానికి పూర్తిస్థాయి తాగునీటి అవసరాలు తీర్చేలా పనిచేస్తామన్నారు. పిఎబిఆర్ డ్యామ్ నుంచి కౌకుంట్ల, కౌకుంట్ల నుంచి రాకెట్ల, ఆమిద్యాల మీదుగా ఉరవకొండ పట్టణానికి ఉన్న పైప్లైన్ 100 హెచ్.పిల సామర్థ్యం కలిగిన రెండు మోటర్లు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ రెండు మోటర్లు పనిచేయడం లేదని, అదనపు మోటార్ కూడా లేదన్నారు. ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పైప్లైన్ మొదలుపెడతామని, హంద్రీనీవా నుంచి కూడా ఉరవకొండ పట్టణానికి నీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి మంత్రి అయినా ఉరవకొండకు మొదటి కూలీగానే తానేనన్నారు. రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఏ పరిస్థితుల్లో ఉన్న ప్రజల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగలా టిడిపి సభ్యత్వ నమోదు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గవ్యాపంగా ఓ పండుగలా టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలో సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొని పండుగలా చేపట్టాలన్నారు. సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల బీమా, మృతిచెందిన కార్యకర్తల అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. పేదల కోసమే సభ్యత నమోదు చేపట్టనున్నట్లు వివరించారు. ఇకపోతే నియోజకవర్గంలోని పిఎబిఆర్ కుడి కాలవ కింద ఉన్న 49 చెరువులకు నీళ్లు అందించనున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో బీమా అనేక పేద కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల కళ్లల్లో ఆనందం కనబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, వెంకట నరసానాయుడు, కట్టమంచి రామలింగారెడ్డి, టిడిపి మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలినిదొర, టిడిపి మండల కన్వీనర్ గుతా ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, చితంబరిదొర, కాయల రమణాయాదవ్, మారుతీనాయుడు, అట్టే రామాంజనేయులు, బండి పరశు రాముడు, కాయల జయరాముడుయాదవ్, రామన్నయాదవ్, వెంకట్రాముడు, ఎం.ఆదినారాయణ, సుధాకర్, కుళ్లాయప్ప, మధుసూదన్‌రెడ్డి, చెన్నయ్య, ప్రతాపు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే గుమ్మనూరు


టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే జయరామ్

ప్రజాశక్తి-పామిడి

రైతుల సంక్షేమ ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. సోమవారం పెనకచెర్ల జలాశయం నుంచి గేట్లు ఎత్తి నార్త్ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పెనకచర్ల డ్యామ్ నుంచి నీరు విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో రైతన్నల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, ముసలిరెడ్డి, పాళ్యం నారాయణస్వామి, జనసేన ధను, పాళ్యం శేఖర్, టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నివాస దినోత్సవం

శింగనమల : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి)లో సోమవారం ప్రపంచ నివాస దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రమాణాల ప్రాముఖ్యత, పట్టణ ప్రణాళికలో యువత సహకారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ ప్రమాణాల బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ అఖిల్ దరువు, ఎంఎల్ఎస్.దేవకుమార్, కోఆర్డినేటర్ రఘుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రంజిత్‌రెడ్డి, సివిల్ విభాగం హెడ్ చిన్నవెంకటరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

గుమ్మఘట్ట : చిన్న, చిన్న జాగ్రత్తలు తీసుకుని సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రమేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే, ప్రాథమిక పాఠశాలల్లో వాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువగా దోమ కాటు రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కావున పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మురళీధర్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఎఎన్ఎం సువర్ణ, హెల్త్ అసిస్టెంట్ మునీర్, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం : ఎస్పీ


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బాధలు, సమస్యలతో వచ్చే పిటీషనర్లను పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల నుంచి 80 పిటీషన్లు స్వీకరించారు. ఇందులో భాగంగా ఎస్పీ పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడి అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గార్లదిన్నె : మండల పరిధిలోని కనుంపల్లి క్రాస్ వద్ద 44 జాతీయ రహదారి పక్కన పంట పొలాల్లో ఓ వ్యక్తి సోమవారం నాడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పామిడి మండలం పాలెం గ్రామానికి చెందిన మధు(28) పెద్దవడుగూరుకు చెందిన అనితను వివాహం చేసుకున్నాడు. వీరికి సంతానం లేకపోవడంతో పిల్లల కోసం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో భాగంగా గత శనివారం ఆసుపత్రిలో చికిత్స తీసుకుని అనంతపురం బయల్దేరారు. అయితే ఇక పిల్లలు కలగరేమో అన్న మనస్తాపంతో మధు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. భార్యను ఇంటికి పంపి మార్గమధ్యంలో ఓ వ్యవసాయ తోట వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ గౌస్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : అనారోగ్య సమస్యల కారణంగా మండలంలోని కొత్తపేట గ్రామంలో ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. గ్రామానికి చెందిన భారతి గత కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈ క్రమంలో పలు అసుపత్రులలో చికిత్సలు చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భారతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైనచికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గొర్రెల దొంగలు పరార్

శింగనమల : గొర్రెల దొంగతనానికి వచ్చి సిఐ వాహనం శబ్ధం విని గొర్రెల వాహనాన్ని వదిలివెళ్లిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు బొలేరో వాహనంలో 8 గొర్రెలను అపహరించేందుకు యత్నించారు. ఆ సమయంలో సిఐ కౌలుట్లయ్య తన వాహనానికి సైరన్ వేసుకుని అటుగా వెళ్లాడు. సైరన్ శబ్ధం విన్న నిందితులు గొర్రెలతోపాటు వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. సిఐ గమణించి గొర్రెలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. గొర్రెల కాపరులకు కూడా గొర్రెలకు సంబంధించిన ఆధారాలు చూపి గొర్రెలను తీసుకెళ్లాలని కోరారు.

పేకాటజూదరులు అరెస్టు

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామ శివారుల్లో ఏడుగురు పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.2,950 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

గుత్తి : మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో రైతు నాగేంద్రకు పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సోమవారం పొలంలో కలుపు పనులు చేసుకుంటున్నాడు. అయితే గుబురుగా ఉన్న మొక్కలలో ఉన్న పాము రైతు చేతికి కాటు వేసింది. గమనించిన రైతు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురం తీసుకెళ్లారు.

పెద్దాసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరచండి

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు మెరుగు పరచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. సోమవారం సర్వనాసుపత్రి ఆర్ఎంఒ హేమలతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలని, రోగులకు లేకుండా ల్యాబ్ రిపోర్ట్స్, అల్ట్రా సౌండ్ సిస్టం, సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్, బ్లడ్ రిపోర్ట్స్ ఎందుకు ఆలస్యం అవుతున్నాయని స్వయాన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వైద్యాధికారులను హెచ్చరించినా మార్పు లేదన్నారు. రోగులకు మెరుగైన వైద్యం, నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సూరి, శేఖర్, ఓబుళపతి, నాగేంద్ర, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

19,819 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ

అనంతపురం : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి నల్లరేగడి నేలల్లో సాగు చేసేందుకు అవసరమైన పప్పుశనగను రాయితీపై సోమవారం జిల్లా వ్యాప్తంగా 19,819 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. సోమవారం వరకు 14,216 మంది రాయితీ విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి 20,044 క్వింటాళ్ల అవసరం అవుతాయన్నారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై అవగాహన

అనంతపురం : ఇండియన్ బ్యాంక్ సమన్వయంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ రూ.10 నాణేల అంగీకారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ శ్రీనివాస నగర్ బ్రాంచ్ మేనేజర్ సాయికృష్ణ తెలిపారు. పది నాణేలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వ్యాపారస్తుల వద్దకు వెళ్లి కరపత్రాలు ద్వారా ఈనెల 21, 22వ తేదీల్లో అవగాహన కల్పిస్తామన్నారు. పది నాణేలు చెల్లుబాటు అవుతాయని, ప్రతి ఒక్కరూ వీటిని తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షిర్డీనగర్ బ్రాంచ్, కళ్యాణదుర్గం రోడ్ బ్రాంచ్ మేనేజర్లు షేక్ జసీరా, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో సోమవారం నాడు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు డ్రైవింగ్ లేనివారికి, సీటు బెల్టు పెట్టుకోని వారికి, హెల్మెట్ లేని వారికి అపరాధ రుసుం వేసినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

గార్లదిన్నె : మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని గ్రామీణ పేదల సంఘం అనంతపురం అధ్యక్షుడు నాగభూషణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ ఈరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నిరుపేదలు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లి గ్రామ సమీపంలో ఉన్న చౌడేశ్వరి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రూ.18 వేల నగదు చోరీకి గురైనట్లు ఆలయ పూజారి లక్ష్మీనారాయణ తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

యువతిపై అత్యాచారం

యల్లనూరు : మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన హరిజన ఓబులేసు అదేగ్రామానికి చెందిన యువతిపై అత్యాచారం చేసిన చేసినట్లు ఎస్ఐ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వెన్నపూసపల్లికి చెందిన హరిజన ఓబులేసు అదేగ్రామనికి చెందిన యువతిని మూడేళ్ల నుంచి వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి అత్యాచారం చేసినట్లు బాధిత యువతి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శింగనమలలో బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో ప్రభుత్వ బాలికల వసతిగృహన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ మాట్లాడుతూ శింగనమల మండల కేంద్రంలో బాలికలు ఉండి విద్యను అభ్యసించడానికి వసతిగృహం లేదన్నారు. గతంలో బాలికల వసతి గృహానికి పక్కా భవనం నిర్మించి ప్రారంభించలేక ఎంఇఒ కార్యాలయానికి కేటాయించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కావున విద్యార్థినుల సౌకర్యార్థం వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు సాయి, జాన్సన్, తేజ, రహీం, జైకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొనకొండ్ల ఉన్నత పాఠశాలలో పిఇటిపై చర్యలకు వినతి

ఉరవకొండ : వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల జిల్లా ఉన్నత పాఠశాల పిఇటి సత్యనారాయణను విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఓతూరు పరమేష్, సిద్ధు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 –2024లో ప్రతి ఎన్‌సిసి విద్యార్థికీ రూ.2వేల చొప్పున దాదాపు 77 మంది అకౌంట్లకు జమ చేసిందన్నారు. అయితే ఆ సొమ్మును విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతి లేకుండా డ్రా చేసుకున్నారన్నారు. కావున వెంటనే పిఇటిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు విధుల నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి, వెంకటేశులు, సూర్యప్రకాష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు, శివ, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ, పాలిటెక్నిక్ కళాశాలకు దారిని ఏర్పాటుకు వినతి


మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలతోపాటు పాలిటెక్నిక్ కళాశాలకు దారిని ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్య పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతురాయుడు, కుళ్లాయిస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి చందు, జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, వంశీ, నగర కార్యదర్శి ఉమా, మహేష్, నాయకులు భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విధి నిర్వహణలో పోలీసులు త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కొనియాడారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జంతులూరులో ఉన్న 14వ పటాలంలో ఎస్పీ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు డిప్యుటేషన్‌పై ఉద్యోగరీత్యా వెళ్లి ఎర్రచందనం ముఠా దాడిలో పోరాడి ప్రాణాలర్పించిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ గణేష్ కుటుంబానికి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసులు ఎంతో ధైర్య సాహసాలతో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి చట్టాన్ని, ప్రజలకు రక్షిస్తున్నారన్నారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంకూ నిస్వార్ధ సేవలు, అంకిత భావాలకు కట్టుబడి ఉందామని పిలుపునిచ్చారు.

వారోత్సవాల్లో వక్తలు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గుత్తి : పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని గుత్తిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అలాగే రైల్వే స్టషన్‌లో ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్లో జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఆధ్వర్యంలో సిబ్బంది అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మెగా రక్తదాన శిబిరం

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువులో లయన్స్ లియో క్లబ్ ఆధ్వర్యంలో ఆర్‌డిటి సహకారంతో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరాన్ని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణ ప్రారంభించారు. ముందుగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఓ వ్యక్తి ఐదు నిమిషాలు వెచ్చించి ఇచ్చే రక్తదానం మరో నిండు జీవితాన్ని నిలబెడుతుందన్నారు. సీఐ ఈరన్న మాట్లాడుతూ రాయలచెరువు లయన్స్ క్లబ్ సభ్యులు 18ఏళ్ల నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్‌కు పోలీస్ శాఖ నుంచి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం దాదాపు 65 మంది రక్తదానం చేయగా వారందరికీ డీఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ, లయన్స్ రవికుమార్‌రెడ్డి, రవిప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రామ్మోహన్‌రెడ్డి, కూచి సూర్యనారాయణ, కత్తి రమేష్, శేషానందరెడ్డి, మురళీకృష్ణ, అల్లాబకాష్, రాజశేఖర్, ప్రసాద్, వికాస్ స్కూల్ రామకృష్ణ, నిదనాడ రామకృష్ణ, మంజునాథ, ప్రవీణ్, గ్రామ పెద్దలు రామ్మోహన్‌రెడ్డి, హరి, చందన, రామాంజనేయులు, రంగనాథ్, సంజు, లయన్స్ లియో సభ్యులు, ఆర్డీటీ సిబ్బంది కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి.సుబ్బయ్య, బొంతా రామాంజనేయరెడ్డి, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

24న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 24న గురువారం ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, జడ్పిటిసి, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

గుత్తి : ప్రభుత్వం సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించామని సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలి



మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్

గుత్తి : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ సూచించారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఎంపిడిఒ, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతిగ్రామంలో పర్యటించి కాలువలు, రోడ్లపై చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. ముఖ్యంగా గృహ సమూదాయాల మధ్య ఉన్న నీటి కుంటలపై ప్రత్యేక దష్టి సారించి వాటిని శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివాజీరెడ్డి. కార్యదర్శులు ధనలక్ష్మి, సుమలత, సాదిక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

నార్పల : నేటి నుంచి ఈనెల 25వతేదీ వరకూ మండల పరిధిలోని కేసేపల్లి, చామలూరు, నడిమిదొడ్డి, నాయనపల్లి సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే ఈమేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్లూరు : మండలంలో నేటి నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు, రేపు కడవకల్లులో, 24న అరకటివేముల, 25న చెర్లోపల్లి సచివాయాల్లో ఆధార్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.